క్లుప్తంగా

వీర్ల అంకమ్మ తల్లి తిరునాళ్ల ప్రారంభం



దాచేపల్లి : నగర పంచాయతీ పరిధిలోని కేసానుపల్లి రోడ్డులో వేంచేసి ఉన్న వీర్ల అంకమ్మతల్లి కొలుపుల తిరునాళ్ల మహోత్సవం మంగళవారం ప్రారంభమైంది. అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా వీర్ల అంకమ్మతల్లి, గోపయ్య స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. తిరునాళ్ల ప్రారంభ సూచికగా ఆలయంలో జలబిందెలకు ప్రత్యేకంగా పూజలు చేసి బొడ్రాయికి జలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య, మార్కెట్‌యార్డు డైరెక్టర్ యర్రంశెట్టి సైదారావు, నాయకులు కుందురు తిరుపతిరెడ్డి, కొప్పుల రామకృష్ణ, సైదారావు, కమిటీ సభ్యులు కొప్పుల గిరి, దిలిప్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



కారెంపూడి: ప్రభుత్వ ఆదేశాల మేరకు వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడం కోసం కారెంపూడి గ్రామ రెవెన్యూ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ జె.శ్రీనివాస్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయించారు. దానిని మంగళవారం జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్ అక్బర్, ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ షేక్ షఫీలతో కలసి తహసీల్దార్ ప్రారంభించారు. వివిధ గ్రామాల నుంచి పనుల నిమిత్తం కారెంపూడికి వచ్చే ప్రయాణికులు వేచి ఉండేందుకు వీలుగా ప్రధాన కూడలిలో తాటి ఆకులతో చలువ పందిరి వేయించారు. పందిరిలో మంచి నీటి క్యాన్లు ఉంచి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ రమావతు ప్రమీలాభాయితేజానాయక్, ఉప సర్పంచ్ సూరె అంకారావు, వీఆర్వో కృష్ణప్రసాద్, గ్రామ కార్యదర్శి కసిన్యానాయక్, వైఎస్సార్ సీపీ నాయకులు కొమ్ము చంద్రశేఖర్, చింతల శ్రీనివాసరావు, బత్తిన వెంకయ్య పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ



దాచేపల్లి : శ్రీశైల మల్లన్న సుటోకాన్ స్పోర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో మంగళవారం దాచేపల్లిలో నిర్వహించిన జిల్లా స్థాయి కరాటే బెల్ట్ పోటీల్లో స్థానిక మదర్‌థెరిస్సా ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సీనియర్ విభాగంలో రాజేష్, కార్తికేయ, వివేక్ ప్రథమ స్థానాల్లో నిలిచారు. జూనియర్ విభాగంలో రాంచరణ్, ధన్వంతరి, పూర్ణిక ప్రథమ స్థానంలో నిలిచారని ప్రిన్సిపాల్ అంబటి చంద్రశేఖర్ చెప్పారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను కోచ్‌లు మల్లికార్జునరావు, సతీష్ తదితరులు అభినందించారు.

గాయత్రీ నమోస్తుతే



పిడుగురాళ్ల: స్థానిక జానపాడు రోడ్డులోని శ్రీ వాసవీ అమ్మవారిని మంగళవారం గాయత్రీ దేవిగా అలంకరించారు. అమ్మవారి జన్మదినాన్ని పురస్కరించుకుని మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారి దివ్య మంగళ స్వరూపాన్ని కనులారా తిలకించి భక్తులు పులకించారు.

ప్రతి ఇంటికీ తాగునీరు 'జలజీవన్' లక్ష్యం



పిడుగురాళ్లరూరల్: ప్రతి ఇంటికీ మంచినీటిని అందించే లక్ష్యంతో జలజీవన్ మిషన్ పని చేస్తోందని జలజీవన మిషన్ మండల కో–ఆర్డినేటర్ కాశయ్య చెప్పారు. కామేపల్లి గ్రామ సచివాలయంలో జల జీవన్ మిషన్‌పై అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ కుటుంబాలకు కుళాయి కనెక్షన్ ద్వారా మంచినీటిని అందించాలన్నారు. కుటుంబంలోని ప్రతి వ్యక్తికీ సుమారు 55 లీటర్ల నీటిని అందించనున్నట్టు వివరించారు. అనంతరం మండల ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు చేతుల శుభ్రంపై అవగాహన కల్పించారు. సర్పంచ్ గోళ్ల వెంకట్రావమ్మ, పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్

రెంటచింతల/మాచర్ల /పిడుగురాళ్ల : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి చెప్పారు. మంగళవారం ఆమె రెంటచింతలలోని ఆంజనేయ స్వామి మాన్యం కాలనీలలో గృహ సారథులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. సంక్షేమ సర్కారుకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు జక్కంపూడి బూసిరెడ్డి, గూలి వెంకటరెడ్డి, షేక్ వలి, అన్నపురెడ్డి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

■ మాచర్ల 13వ వార్డు వడ్డెర కాలనీలో మంగళవారం మున్సిపల్ మాజీ చైర్మన్ తురక కిషోర్ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమ స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహ సారథులు, బీసీ సంఘ నాయకులు చల్లా కాశయ్య, చల్లా మోహన్, రాంబాబు, శివారెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

■ పిడుగురాళ్ల పట్టణంలోని 33వ వార్డులో జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శివాలయం బజారులోనూ కౌన్సిలర్, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు.



రెంటచింతలలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం



మాచర్ల 13వ వార్డులో..



పిడుగురాళ్ల పట్టణంలో..

దోమలేరియా లేకుండా చేద్దాం



రెంటచింతల మండలం కంభంపాడులో ర్యాలీ



కారెంపూడి మండలంలో..



గురజాలలో..



మాచవరంలో..

- ఊరూవాడా ప్రతిన
- భారీగా అవగాహన ర్యాలీలు
- సూచనలిచ్చిన వైద్యాధికారులు

రెంటచింతల/కారెంపూడి/గురజాల/మాచవరం/ పిడుగురాళ్ల/పిడుగురాళ్ల రూరల్: ప్రపంచ మలేరియా దినం సందర్భంగా మంగళవారం మాచర్ల, గురజాల నియోజకవర్గాల్లో వైద్యాధికారులు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పలు చోట్ల ప్రదర్శనలు చేపట్టి దోమలేరియాలు లేకుండా చేద్దామని ప్రతినబూనారు. రెంటచింతల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి, కంభంపాడు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో రెంటచింతల, కంభంపాడుల్లో ర్యాలీలు జరిగాయి. కార్యక్రమంలో సీహెచ్‌వో పూజల నాగేశ్వరరావు, మలేరియా సబ్ యూనిట్ ఆరోగ్య పర్యవేక్షకులు సీహెచ్ అంకమ్మరావు, ఎస్‌కే నాగూర్‌భాష, మలేరియా హెల్త్ అసిస్టెంట్లు శివ, బాలయ్య, ఎల్‌టి శ్రీనివాస్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

■ కారంపూడి మండలం పెదకొదమగుండ్ల శివారు బ్రహ్మనాయుడు కాలనీలో గాదెవారిపాల్లె పీహెచ్‌సీ వైద్యులు ఆర్. అంజనేయులు నాయక్, విజయానాయక్, ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. దోమల నివారణపై స్థానికులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. వైద్య సిబ్బంది విజయలక్ష్మి, శ్రీనివాసరావు, శాంతకుమారి, వెంకటరత్నం, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

■ మాడుగుల వైద్యశాలలో వైద్యురాలు పద్మావతి దోమల నివారణపై సూచనలు, సలహాలు ఇచ్చారు. పరిసరాల పరిశుభ్రతపై వివరించారు. గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద వైద్యుడు నితన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యురాలు లక్ష్మీ, మలేరియా సబ్ యూనిట్ సబ్ యూనిట్ అధికారులు గౌస్, అంకమ్మరావు, హెల్త్ సూపర్‌వైజర్ అల్లం శ్రీనివాసరావు, ఏఎన్‌ఎంలు లక్ష్మీ, విమల, సంధ్యారాణీ, భాగ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

■ మాచవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ ప్రసాద్, డాక్టర్ చక్రవర్తి ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు

■ పిడుగురాళ్ల రూరల్ మండలం కరాలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు కె.నాగిరెడ్డి, కేవీ ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు.

■ పిడుగురాళ్ల వైద్యాధికారిణి కె.ప్రభావతి ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యూపీహెచ్ డాక్టర్లు మణికంఠ, అనిల్, హర్షిత, ప్రాథమిక ఆరోగ్య సీహెచ్‌వో హర్షవర్ధన్, సబ్ యూనిట్ ఆఫీసర్ కోడెల శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.



పిడుగురాళ్ల రూరల్ కామేపల్లిలో..



పిడుగురాళ్లలో..

సేవా దృక్పథంతో ముందుకు సాగాలి

గురజాల : సమాజంలో సేవా దృక్పథంతో ముందుకు సాగాలని మండల వ్యవసాయ అధికారిణి ఎం.సంధ్యారాణి చెప్పారు. స్థానిక శ్రీ పాట పాటేశ్వరి అమ్మవారి ఆలయంలో మంగళవారం స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేదలకు అన్నదానం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సంధ్యారాణి పాల్గొని అన్నదానం చేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు గుండా కాశీవిశ్వనాథం, బండి రవికుమార్, కొండలరావు, కనకం హనుమంతరావు, వి మల్లికార్జునరావు, చింతకాయల కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గురజాల: రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన మంగళవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. బొల్లాపల్లి మండలం మర్రిపాలెం గ్రామానికి చెందిన గాదె బ్రహ్మారెడ్డి (35) వ్యాన్‌లో మిర్చి లోడుతో గుంటూరు వెళ్లి అన్‌లోడు చేసి తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో మార్గమధ్యలో అంబాపురం శివ పార్వతి కోల్డ్‌స్టోరేజీ వద్ద ఎదురుగా మిర్చి లోడుతో వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. ఈ ఘటనలో బ్రహ్మారెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న సీఐ అశోక్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

వైభవంగా వీరభద్రుని కల్యాణం

మాచవరం: పిన్నెల్లి గ్రామంలో శ్రీవీరభద్రుడి కల్యాణ మహోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా వీరభద్రునికి ఆచారవంతుల వీరాచార కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామిని గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కల్యాణం సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి పౌరాణిక నాటకం గ్రామస్తులను అలరించాయి.

బాబు ఎస్సీలను చులకన చేస్తే ఊరుకోం

పిడుగురాళ్ల: టీడీపీ అధినేత చంద్రబాబు ఎస్సీలను చులకన భావంతో చూస్తే ఊరుకునేది లేదని పిడుగురాళ్ల మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కొమ్ము ముక్కంటి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. కొమ్ము ముక్కంటి మాట్లాడుతూ ఈ నెల 22న యర్రగొండపాలెంలో చంద్రబాబు నిర్వహించిన రోడ్‌షో సందర్భంగా మంత్రి ఆదిమూలపు సురేష్ పట్ల టీడీపీ నేతల వ్యవహారశైలి హేయమని విమర్శించారు. చంద్రబాబు, ఆ పార్టీ నేతలు గతంలోనూ ఎస్సీలను చులకన చేస్తూ వ్యాఖ్యలు చేశారని గుర్తు చేశారు. దళితులు చంద్రబాబును నమ్మేస్థితి లేదని, 2024 ఎన్నికల్లో ఆయనకు బుద్ధిచెప్పడం ఖాయమని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీలకు అత్యున్నత పదవులు కట్టబెట్టారని ముక్కంటి హర్షం వ్యక్తం చేశారు. గురజాల నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ యూత్ అధ్యక్షులు మందా సుధీర్, కౌన్సిలర్ పసుపులేటి ఆనంద్‌బాబు, మార్కెట్ యార్డు డైరెక్టర్ చల్లగుండ్ల స్వామి, జాషువా, వైఎస్సార్‌సీపీ నాయకులు చల్లగుండ్ల సంతోషరావు, డేగల యోహాను, ఎం.శేఖర్, పలువురు వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి, ఎస్సీ నాయకులు

భవనంపై నుంచి పడి కార్మికుడి మృతి

యడ్లపాడు: భవనంపై నుంచి పడి తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుడు మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రం గంజాం జిల్లా గోబిందపూర్ గ్రామానికి చెందిన పవిత్ర స్వైన్ కుటుంబం ఉపాధి పనుల నిమిత్తం పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం తిమ్మాపురంలోని కల్పతరువు నూలుమిల్లులో ఐదేళ్ల కిందట చేరారు. నాటి నుంచి మిల్లు ఆవరణలోని క్వార్టర్లలో నివాసం ఉంటూ జీవనం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి పవిత్రస్వైన్ (42) మద్యం సేవించి రెండస్తుల భవనంపై ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయాలైన అతన్ని గుంటూరు జీజీహెచ్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. భార్య కస్తూరిస్వైన్ ఫిర్యాదుతో యడ్లపాడు ఎస్ఐ పైడి రాంబాబు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

వైభవంగా చౌడేశ్వరీ జ్యోతి ఉత్సవం

నరసరావుపేట ఈస్ట్: పాతూరులో వేంచేసియున్న శ్రీచౌడేశ్వరీ అమ్మవారి ఏకాదశ జ్యోతుల మహోత్సవం మంగళవారం తెల్లవారు జామున వైభవంగా నిర్వహించారు.

పౌరాణిక, జానపద కళలను ఆదరించాలి



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

రొంపిచర్ల: పౌరాణిక, జానపద కళలను ఆదరించాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని బుచ్చిపాపన్నపాలెం గ్రామంలో ఆల్ ఇండియా కళారంగ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నిర్వహించిన పౌరాణిక పద్య, ఏకపాత్రల పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామానికి చెందిన ఆర్మోనిస్టు గురువు మందలపు కేశవులు వర్ధంతి సందర్భంగా పోటీలను నిర్వహించటం ఆనందదాయకమన్నా రు. డీవీ సుబ్బారావు లాంటి కళాకారులు సత్యహరిశ్చంద్ర నాటకంలో కాటిసీను పాత్రలో పద్యాలు పాడేవారన్నారు. అలాంటి కళాకారుల నాటకాలు ఎంత దూరంలో ప్రదర్శిస్తున్నా వ్యయప్రసాలకోర్చి చూసేవారన్నారు. ఈ పోటీలలో పాల్గొని విజేత లైన వారికి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రవితేజ, వైఎస్సార్‌సీపీ నాయకులు పచ్చవ రవీంద్రబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పడాల సాంబశివారెడ్డి, కురుగుంట శ్రీనివాసరెడ్డి, గుండాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ సారా కేసులో నిందితుడి అరెస్ట్

నరసరావుపేట టౌన్: అక్రమ నాటుసారా, మద్యం కేసుల్లో పరారీలో ఉన్న నిందితుడిని అరెస్ట్ చేసినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్ఐ సురేంద్ర బాబు మంగళవారం తెలిపారు. పమిడిపాడు గ్రా మంలో రెండు నెలల క్రితం బండ్ల హరికృష్ణ అక్రమ నాటుసారా విక్రయిస్తుండగా దాడులు నిర్వహించి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆ సమయంలో నిందితుడు పరారయ్యాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి అతని కోసం గాలిస్తుండగా పమిడిపాడు శివారు పట్టుబడ్డారన్నారు. అదేవిధంగా గతంలో పట్టుబడ్డ తెలంగాణ అక్రమ మద్యం కేసులో కూడా హరికృష్ణ నిందితుడిగా ఉన్నాడన్నారు. రెండు కేసుల్లో అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నాగపవన్‌కుమార్‌కు విశ్వజననీ సేవారత్న అవార్డు

వినుకొండ(నూజెండ్ల): పట్టణానికి చెందిన వాసవీ క్లబ్ డిస్ట్రిక్ట్ ఇన్‌చార్జి గజవల్లి నాగపవన్‌కుమార్‌కు విశ్వజననీ సేవా రత్న అవార్డు లభించింది. నరసరావుపేటలో జరిగిన విశ్వజననీ ఫౌండేషన్ ప్రథమ వార్షికోత్సవ సభలో పవన్‌కుమార్ ఫౌండేషన్ సభ్యుల చేతుల మీదుగా ఈ సేవా రత్న పురస్కారం అందుకున్నారు. అవార్డు పొందిన పవన్‌కుమార్‌ను పట్టణానికి చెందిన విశ్వహిందూ పరిషత్, ఆర్య వైశ్య సంఘం, వాసవీక్లబ్ సభ్యులు, మిత్రులు అభినందించారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు



పార్టీలో చేరిన వారితో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

కారెంపూడి: ఒప్పిచర్ల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు చిరుమామిళ్ల వెంకటసత్యనారాయణ, చిరుమామిళ్ల కోటేశ్వరరరావు, చిరుమామిళ్ల సుబ్రమణ్యం తదితరులు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే) సమక్షంలో మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి పీఆర్కే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ పంగులూరి చినవెంకటనర్సయ్య, మాజీ ఎంపీటీసీ ఓగూరి రామయ్య, మాజీ సర్పంచ్ రామదేని అంజయ్య, పంగులూరి బుచ్చెయ్య, చిరుమామిళ్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. తనకు ఒప్పిచర్ల గ్రామ ప్రజలు అందిస్తున్న సహకారం అండదండలు మరువలేనివని, గ్రామాభివృద్ధి కోసం తన వంతు చేయూత ఎప్పుడూ అందిస్తానని పీఆర్కే వారికి హామీ ఇచ్చారు.

ఎడ్ల బలప్రదర్శన పోటీలు ప్రారంభం



ఎడ్లబల ప్రదర్శన జరుగుతున్న దృశ్యం

దాచేపల్లి : తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఎడ్ల బలప్రదర్శన పోటీలు స్థానిక వీర్ల అంకమ్మతల్లి ఆలయం ప్రాంగణంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. వీర్ల అంకమ్మతల్లి తిరునాళ్ల సందర్భంగా జరుగుతున్న ఈ పోటీలను నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య ప్రారంభించారు. తొలుత పాల పళ్ల విభాగంలో జరిగిన పోటీలో 24 ఎడ్ల జతలు పాల్గొన్నాయి. న్యాయ నిర్ణేతగా దుర్గి శ్రీనివాసరావు వ్యవహరించారు. పోటీలను తిలకించేందుకు అధిక సంఖ్యలో రైతులు తరలివచ్చారు. ప్రారంభ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కొప్పుల గిరి, దిలిఫ్, కొప్పుల రవికుమార్, నాయకులు కుందురు తిరుపతిరెడ్డి, సైదారావు, కొత్వాల్ సైదా తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ల సేవలు ఎనలేనివి

మాచర్ల: క్రీస్తు బోధనలను ప్రజల్లోకి తీసుకెళ్తున్న పాస్టర్ల సేవలు ఎనలేనివని పశ్చిమ సినడ్ బిషప్ చాట్ల ఐజయ్య చెప్పారు. మంగళవారం పట్టణంలోని లూథరన్ చర్చిలో పశ్చిమ సినడ్ 86వ వార్షికోత్సవ మహాసభను నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది లూథరన్ చర్చిల పాస్టర్లు తరలిరాగా వారందరికీ చాట్ల ఐజయ్య, డీఎంసీ ఎల్.బెనర్జీ, మేకుల హుస్సేన్, యోహాన్, జీవరత్నం సందేశాలందించారు. వందలాది మంది చర్చి పాస్టర్లు లూథరన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన డెలిగేట్లు సంఘ బలోపేతం కోసం మాట్లాడుతూ అన్ని సంఘాల చర్చిలు అభివృద్ధి చేసి ఏసుక్రీస్తు బోధనలు ప్రజలలోకి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో చర్చి పెద్దలు కొమ్ము మాణిక్యరావు, కొత్తపల్లి డేవిడ్‌రాజు, అల్లి జీవన్, ప్రమీలారాణితోపాటు పలువురు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేయండి

హౌసింగ్ పీడీ వేణుగోపాల్



సమీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

మాచర్ల: పట్టణంలో జగనన్న కాలనీల నిర్మాణాన్ని పూర్తి చేయాలని పల్నాడు జిల్లా హౌసింగ్ పీడీ వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో హౌసింగ్ డిపార్ట్‌మెంట్ సచివాలయం ఇమ్యూనిటీస్‌తో హౌసింగ్ పథకంపై సమీక్షించారు. మూడో విడత ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ బాలాజీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'తో ఆరోగ్య భరోసా

దుర్గి: పేదలకు ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ఆరోగ్య భరోసా లభిస్తోందని డాక్టర్ జి.లావణ్య చెప్పారు. మంగళవారం మండలంలోని ఓబులేశునిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి రోగులను పరిశీలించి మందులు అందజేశారు. అనంతరం రాజనగరం గ్రామంలో ప్రపంచ మలేరియా దినం నిర్వహించారు. గ్రామస్తులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సుబద్దు, ఎంపీహెచ్‌ఏ వాగ్యానాయక్, మహిళా ఎంపీహెచ్‌ఏ శ్రీలక్ష్మి, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాతా శిశు సంరక్షణపై సమీక్ష

వెల్దుర్తి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలతో మాతా శిశు సంరక్షణ అంశాలపై ఐసీడీఎస్ పీడీ బి.అరుణ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. అంగన్‌వాడీలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించి రక్తపరీక్షలు చేయించి, కాన్పులు ప్రభుత్వ వైద్యశాలలో చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతినెలా పరీక్షలు చేయించుకునేలా వారిని చైతన్య పర్చాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రసాద్, ఈఓపీఆర్డీ జవహర్‌లాల్ నెహ్రూ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు దుర్గా, జ్యోతి, లీలావతి, మహాలక్ష్మి పాల్గొన్నారు.

శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర సహాయ కార్యదర్శిగా రాకేష్

నరసరావుపేట ఈస్ట్: అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సేవాసంస్థ శ్రీశ్రీ కళావేదిక ఏపి రాష్ట్ర సహాయ కార్యదర్శిగా పట్టణానికి చెందిన గుండాల రాకేష్ నియమితులయ్యారు. ఈమేరకు సంస్థ చైర్మన్ డాక్టర్ కె.ప్రతాప్ నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నట్టు రాకేష్ మంగళవారం తెలిపారు.